క్లుప్తంగా

నేడు, రేపు గడప గడపకు వాయిదా

చింతపల్లిరూరల్: మండలంలోని కుడుమసారిలో సోమ, మంగళవారాల్లో జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా పడిందని ఎంపీపీ కోరాబూ అనూషదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తేదీలు నిర్ణయించి మరలా తెలియజేస్తామని ఆమె పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన రేపు

మారేడుమిల్లి: మండలంలో మంగళవారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పర్యటించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా తాడేపల్లి గ్రామంలో ఉదయం 10.30 గంటలకు మద్దివీడు–వేటుకూరు, నీలవరం – గాలిగోపురం మధ్య రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం టేకులవీధిలో 11.15 గంటలకు కె.వి.లంక- టేకులవీధి, గుర్రమామిడి గ్రామంలో గుర్రమామిడి–తాడేపల్లి రోడ్డు పనులకు, మధ్యాహ్నం ఒంటిగంటకు సున్నంపాడు గ్రామంలో సున్నంపాడు–నూరుపూడి గ్రామాల మధ్య రహదారి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీ, సాయంత్రం 4 గంటలకు కుండాడ –జీఎం వలస, సాయంత్రం 5 గంటలకు వేటుకూరు నుంచి దేవుడలంక గ్రామాలకు కొత్త రహదారుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



లుంగాపుట్టు వద్ద రహదారి వైపు ఒరిగి ఉన్న ఎండిన చెట్టు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన మార్గంలో లుంగాపుట్టు మలుపు వద్ద భారీ చెట్టు పూర్తిగా ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులుగా విచిన ఈదురు గాలులకు మరింత చెట్టు ఒరిగిపోవడంతో వాహనచోదకులు మరింత భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో వాలిపోయి ఉన్న ఎండిన చెట్టుతో వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ క్షణంలో చెట్టు కూలుతుందోనని భయపడుతున్నారు. ప్రమాదం జరగక ముందే పంచాయతీ అధికారులు స్పందించి ఎండిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

ధర్మ ప్రచారం ప్రారంభం



ఇంటింటి ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు

పాయకరావుపేట : సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఇంటింటి ధర్మ ప్రచారం నిర్వహించనున్నట్లు సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ నీలాపు వెంకటరెడ్డి తెలిపారు. 15వ విడత కార్యక్రమంలో భాగంగా ఇది జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఆదివారం బంగారయ్యపేట గ్రామంలో పలువురు మహిళలతో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ కట్టా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు గొర్రెల మృతి



చనిపోయిన గొర్రెలు

నక్కపల్లి: మండలంలో వేంపాడులో ఆదివారం విద్యుదాఘాతానికి గురై నాలుగు గొర్రెలు మృతి చెందాయి. అల్లు అప్పారావుకు చెందిన నాలుగు గొర్రెలు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్ట్ వైరు తగలడంతో షాక్‌కు గురయ్యాయి. మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధితుడు అప్పారావు కోరారు.

సాగుకు అప్రమత్తతే కీలకం



దముకు సమీపంలోని పొలాలు



మర్రిగుడలో పొలాలు

- సాగునీటి వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి
- వ్యవసాయశాఖ అధికారుల సూచనలు

అనంతగిరి: మన్యంలోని ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో సంవృద్ధిగా నీరు చేరింది. సాగునీటి వినియోగం సమతౌల్యంలో ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పంటకు నీరు ఎక్కువైనా, ఎద్దడి తలెత్తినా దిగుబడిపైనా భూసారంపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. నీరు, భూమికి ఉండే సహజ లక్షణాలను గుర్తించి ఏ భూమిలో ఏ నీటితో పంటలను పండించాలనే విషయంపై రైతులకు అవగాహన ఉండాలని సూచిస్తున్నారు.

నీటి వినియోగం ఇలా ఉండాలి

పంటలకు నీటి వినియోగంపై అధికారులు అందిస్తున్న సూచనలు ఈ విధంగా ఉన్నాయి. ఎకరా వరి పంటకు 1,250 మిల్లీ లీటర్ల నీరు అవసరం ఉంటుందని అంచనా. పై భాగాన ఉండే రైతులకు అవగాహన లోపంతో ఎక్కువ నీటిని వినియోగించడంతో 20 శాతం పల్లపు ప్రాంత రైతులకు సాగునీటి సమస్య ఏర్పడుతుంది. సాగు దశలో సకాలంలోని నీరు అందక పంట దిగుబడి తగ్గిపోతుంది. పైరుకు తడి 75 శాతం వరకు తగ్గిపోతే నీటి ఎద్దడి ఉన్నట్టు లెక్క. పంటకు అవసరం లేకుండా ముందస్తుగా నీరు అందజేసినా ప్రాణవాయువు దక్కన్నప్పుడు నీరు పలచగానూ, మొన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బుచేయడం పూర్తయ్యేవరకు 2 సెంటీమీటర్ల నీరు ఉంటే సరిపోతుంది. చిరుపొట్టదశ నుంచి గింజ గట్టిపడే వరకు 5 సెంటీమీటర్ల నీరు ఉండాలి. ఈనిక, చిరుపొట్ట దశల్లో ఎట్టిపరిస్థితిల్లోనూ నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు వహించాలి. కోతకు పది రోజుల ముందు నీటిని నెమ్మదిగా తగ్గించాలి.

సూచనలు పాటించాలి

పంటల సాగుపై రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. ప్రస్తుతం వర్షాకాలం కురుస్తుండడంతో రైతులు అప్రమత్తంగా ఉంటే దిగుబడి సాధించవచ్చు. నీరు ఎక్కువైతే తెగుళ్ల, పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. పిలకలు పెట్టే సామర్థ్యం తగ్గుతుంది. నీరు ఎక్కువగా ఉంటే చేను పెరగదు. నీరు తక్కువగా ఉండే ప్రదేశంలోని ఆరుతడి పంటలను సాగు చేయడం మంచింది. పంట పొలాల్లో సాగునీరు కావాల్సినంత ఉండే విధంగా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

– ఫణి, వ్యవసాయాధికారి, అరకులోయ

300 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహరాజ్ తెలిపారు. రామకృష్ణ మిషన్ మేనేజర్ స్వామి రఘువీరనంద మహరాజ్ శిబిరంలో సేవలను పరిశీలించారు. శిబిరంలో డాక్టర్లు గోలి వెంకట రామారావు, కస్తూరి సుబ్రహ్మణ్యం,శ్రీకృష్ణ పాతూరి, ప్రజ్ఞ, టి.వి.సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్ కుమార్ మరియు జి.ఎస్.ఎల్ వైద్యులు సేవలందించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మందికి వైద్య సేవలందించినట్లు స్వామీజీ తెలిపారు. 95 మందికి రక్తపరీక్షలు, తొమ్మిది మందికి థైరాయిడ్ పరీక్షలు ,8 మందికి ఈసీజీలు , 24 మందికి ఎక్స్‌రేలు, ఏడుగురుకి ఫిజియథెరపీ చేశామన్నారు. వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 56 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 17 మందికి కళ్లద్దాలు, .ఏడుగురిక కంటి ఆపరేషన్లు నిమిత్తం వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రికి తరలించారు. క్యాంప్ కో - ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, వలంటీర్లు ఎల్.జి.బి.భగీరథరాజు. ఉదయ్‌కిరణ్. మంగిరెడ్డి, చంద్రం, చంద్ర శేఖర్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రోగులకు, సహాయకులకు అన్నదానం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట



మత్స్యగుండం ఆలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట

హుకుంపేట: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం మత్స్యగుండం దేవాలయం ప్రాంగణంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ముందుగా మత్స్యలింగేశ్వర స్వామిని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మఠం శాంతికుమారి మాట్లాడుతూ అరుకు నియోజకవర్గంలో ఏ శివాలయంలో లేని విధంగా మత్స్యగుండం దేవాలయంలో నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించినట్టు చెప్పారు. మత్స్యగుండంలో వచ్చే భక్తులు అందరు నవగ్రహాలను దర్శించుకు నిగ్రహ దోషాలను పోగొట్టు కోవాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు తమర్బ అప్పారావు, సూర్యనారాయణ, కేశవరావు, చంద్రశేఖర్, కొండబాబు, సింహాచలం, రాములమ్మ , హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ రాజుబాబు, అగ్రికల్చర్ జిల్లా చైర్మెన్ సరస్వతి, గోపాలపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ పోలీసులు, ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలను పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచి పెట్టారు. గత రెండు రోజులుగా రాత్రిళ్లు సైతం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద గస్తీని ఏర్పాటు చేశారు. వాహనచోదకుల రికార్డులు పరిశీలించి, ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన పత్రాలు కచ్చితంగా కలిగి ఉండాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తుంచుకుని సహకరించాలని ఎస్ఐ రవీంద్ర కోరారు. సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులున్నారు.

ఆదివాసీ హక్కులను పరిరక్షించాలి

రంపచోడవరం: కేంద్ర ప్రభుత్వం చేసిన అటవీ సంరక్షణ(సవరణ) చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నంలో జరిగే అఖిలభారత ఆదివాసీ సదస్సును విజయవంతం చేయాలని ఏజెన్సీ గిరిజన సంఘం అధ్యక్షుడు వంజం జోగారావు దొర కోరారు. కేంద్ర ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని సవరణ చేసి అడవిలో సహజ సంపదలను, ఖనిజాలను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేందుకు చూస్తుందని ఆరోపించారు. ఆదివాసీ హక్కులను పరిరక్షించుకోవాలని కోరారు. ఈ మేరకు అఖిల భారత కేత్ మజ్దూర్ కిసాన్ సభ ఆధ్వర్యంలో ఈనెల 12 ,13 తేదీల్లోని విశాఖలో జరగనున్న అఖిలభారత ఆదివాసీ సదస్సుకు పది రాష్ట్రాల నుంచి ఆదవాసీ, రైతుకూలీ, కార్మిక నేతలు హాజరవుతున్నారని, గిరిజనులు, ప్రజాతంత్ర వాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రామకోటి స్థూపం ఆవిష్కరణ



లక్ష్మీ నరసింహం దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు



పల్లకిలో సీతారాములను ఊరేగిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు శ్రీరామ పంచాయతన ఆలయంలో ఆదివారం రామకోటి స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త శ్రీపాద సత్యదేవశర్మచే ఈ స్థూపం నిర్మించబడింది. విజయనగరానికి చెందిన ప్రముఖ సహస్రావధాని బ్రహ్మశ్రీ కోట లక్ష్మీనరసింహం దంపతులచే ఈ స్థూపాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సీతారాముల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం వేద పండితులతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మండపారాధన, పుణ్యనదీ జలాలతో సీతారాముల మూల విరాట్‌కు పట్టాభిషేక మహోత్సవం, వేదపారాయణం, శ్రీరామనామ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పాలు, ఆశీర్వచనం కార్యక్రమాలు జరిగాయి. సహస్రావధాని బ్రహ్మశ్రీ కోట లక్ష్మీనరసింహం దంపతులను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకులరాజు, తాలూకా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు డీవీ రామారావు, శ్రీపాద ప్రణవ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉపకార వేతనాలకు అర్హత పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

మాడుగుల రూరల్: సృజనవాణి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉపకార వేతనాలకు అర్హత పరీక్షకు 190 మంది విద్యార్థులు హాజరయ్యారని సంస్థ సమన్వయ కర్త కె. జానీ తెలిపారు. స్కాలర్‌షిప్ అనే ప్రోగ్రామ్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, నర్సింగ్ చదువుతున్న 250 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా వడ్డాది, చోడవరం, మాడుగుల, మండలాల నుంచి 190 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. వీరిలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు.

మదిని దోచే మన్యం అందాలు



జాముగుడలో కళకళలాడతున్న పొలం



కొల్లాపుట్టులో నీలిరంగు దాలియా పుష్పాలు

డుంబ్రిగుడ: ప్రస్తుతం మన్యం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఎటుచూసినా ప్రకృతి అందాలు దర్శనమిస్తున్నాయి. గడిచిన కొద్ది రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. మండలంలోని గుంటగన్నెల పంచాయతీ జాముగుడ గ్రామంలోని ఎత్తైన కొండల మధ్య వరి పంటల సాగుతో ప్రకృతి అందాలు కట్టిపడేస్తున్నాయి.

ఆకట్టుకుంటున్న దాలియా పుష్పాలు

ఆంధ్రా–ఒడిశాసరిహద్దు ప్రాంతంలోని కొల్లాపుట్టు పంచాయతీ మారుమూల ప్రాంతమైన ఎగువ కొల్లాపుట్టు, డెక్కపారు గ్రామాల్లోని గొల్లోరి దామోదర్, సుశీల అనే గిరిజనుల ఇంట్లో విరగ్గాసిన దాలియా అందాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ మార్గంలో వెళ్లున్న వాహనచోదకులకు పూల అందాలు కట్టిపడేస్తున్నాయి. దీంతో అలాగే పూల అందాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

కనకదుర్గమ్మకు పసుపు కుంకుమలు



నూకాంబిక ఆలయం నుంచి పసుపు, కుంకుమ తీసుకెళ్తున్న ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మకు నూకాంబిక ఆలయం తరపున ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ఆదివారం పసుపు, కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా రాబోయే దసరా వేడుకల నేపథ్యంలో కనకదుర్గమ్మకు పసుపు, కుంకుమలను సంప్రదాయంగా సమర్పించినట్లు తెలిపారు. శరన్నవరాత్రులను అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిది రోజులూ బాలాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దుర్గమ్మ ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పొలిమేర శ్రీను, దాడి అప్పలనాయుడు, పెంటకోట లక్ష్మీనారాయణ, సూరిశెట్టి తేజ పాల్గొన్నారు.

వైభవంగా పార్థసారథి స్వామి ఊరేగింపు



పార్థసారథి స్వామి ఊరేగింపులో అర్చకులు

మాడుగుల: పురాతన పార్థసారథి స్వామి ఆలయంలో ఆదివారం కృష్ణాష్టమి ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూర్వకాలం నుంచి ఇక్కడ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఏటా నిర్వహిస్తుంటామని అర్చకులు తెలిపారు.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయ మండపంలో భక్తుల కోలాహలం

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. శ్రావణ మాసం నాలుగో ఆదివారం కావడంతో అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణలు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ఉడ్‌పేటకు చెందిన ఆకులేటి సూర్యనారాయణ, లలిత దంపతులు అర తులం బంగారు శతమానాలను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హనుమత్ మహా యజ్ఞం పాదయాత్ర



హనుమత్ మహా యజ్ఞం పాదయాత్రలో భక్తులు

కశింకోట: కశింకోట వద్ద కనకదుర్గమ్మ ఆలయం నుంచి శ్రీహనుమత్ కోటి నామ లిఖిత మంత్రజప మహా యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం భక్తులు పాదయాత్ర నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర జాతీయ రహదారి, సంతబయల, పెద బజారు మీదుగా స్థానిక దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయం వద్దనున్న మారుతి విద్యా పీఠం వరకు సాగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, యువ చారిటబుల్ ట్రస్టు, మారుతి విద్యా పీఠం అధ్యక్షుడు రేజేటి మారుతి తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు.

మోదకొండమ్మకు శ్రావణ పూజలు



మోదకొండమ్మను అలంకరించిన దృశ్యం



ప్రత్యేక అలంకరణలో కె.జె.పురం మోదమాంబ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో శ్రావణమాసం ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచితంగా ప్రసాదం అందజేసింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి ఆలయంలో భజనలు ఏర్పాటు చేశారు. చెరకు కాటా ఆవరణలో నూకాంబిక ఆలయంలో పూజలు నిర్వహించారు. సాయంత్రం నుంచి భజన కార్యక్రమం జరిగింది. ఎం.కె.వల్లాపురం కాటా ఆవరణలో మోదమాంబ ఆలయంలో, సాగరం మోదమాంబకు పూజలు నిర్వహించారు.

జీవకారుణ్య సంఘ భవనంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సంఘ సభ్యులు

రోలుగుంట: స్థానిక జీవకారుణ్య సంఘ భవనంలో సంఘ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. 1965లో నిర్మించిన ఇక్కడ భవనం శిథిలం కావడంతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మలను ఆర్నెల్ల క్రితం కలిసి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన విప్ ధర్మశ్రీ ఆదేశాల మేరకు జెడ్పీటీసీ రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో మండల పీఆర్ జేఈ ఉమామహేశ్వరుడు పర్యవేక్షణలో అనుబంధ సంఘం సిద్ధి వినాయక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మాకిరెడ్డి శ్రీను, టాన్స్‌పోర్ట్ సత్తిబాబు ముందుకొచ్చి శరవేగంగా పనులు చేస్తున్నారు. ఇక్కడ నవరాత్రోత్సాల నిర్వహణకుగాను ఇక్కడ సంఘ ఫౌండర్ గైరమ్మ సత్యం దంపతులతో వినాయక పూజ చేయించి లాంఛనంగా భవన ప్రవేశం చేశారు. సంఘ సభ్యులు సుర్ల నాయుడు, కొట్టే సంజీవి, ఆదారి గణేష్ పాత్రో, మడ్డు శ్రీను, ఆదారి వాసు, సిద్ధి వినాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి రూ.50 వేల విరాళం

అనకాపల్లిటౌన్: స్థానిక ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక ఆలయ అభివృద్ధికి విశాఖకు చెందిన కెవీఎల్ఎస్ మూర్తి రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణకు ఈ విరాళాన్ని ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసి, అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆదివారం అమ్మవారి దర్శించుకుని ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నూతన పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.